# అజాత శత్రువు

- మల్లాది సూరిబాబు

భారతదేశానికి స్వతంత్రం వచ్చిన మలిరోజుల్లో ఒకనాటి ఉదయం. దేశంలో ఎంతో సంచలనం కలిగించిన ఒక నూతన రాష్ట్ర ముఖ్యమంత్రిగారి గదిలో-భయంభయంగా నిశ్శబ్దం.

శ్రీవారు ఆ గదిలో ఉన్న ఆ నలుగురి వంకా చూశాడు. ఆ చూపులో నవరసాలూ ఉన్నాయి.

ఈ ముఖ్యమంత్రి పరిపాలించే రాష్ట్రం దేశంలో మిగతా రాష్ట్రాల కంటే చిన్నదే కావచ్చును. అన్ని విషయాల్లో ఇంత కాలం వెనుకబడి ఉండవచ్చును. ప్రజాస్వామ్యం ఇంకా ప్రారంభదశలోనే ఉండవచ్చును. కానీ ప్రపంచచరిత్రలో ఈ రాష్ట్రానికి ఒక ప్రత్యేకత ఉంది.

అది ఆ రాష్ట్రముఖ్యమంత్రి!

విప్లవవీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయపితామహుడు, వయోవృద్ధుడు, జ్ఞాని.

పన్నులు ఎక్కువ వేసినా ప్రజలను కన్నబిడ్డల్లాగా పరిపాలించేవాడు.

దేశంలోని ప్రజల శాంతిభద్రతలు, ప్రభుత్వం కంటే ప్రజలే బాగా పరిరక్షించగలరన్న గట్టి నమ్మకం గల వ్యక్తి.

తుఫానులు, వరదలు, కరవుకాటకాలు, అగ్నిపర్వతాలు పేలడం, భూకంపాలు, దొంగతనాలు, అవినీతి, దోపిడులు, మానభంగాలు -ఇవి కూడా దైవసంఘటనలు, ప్రకృతివైపరీత్యాలు. వీటిలో మానవప్రమేయం ఏమీ లేదు.

విధివ్రాతను ఎవ్వరు తప్పించగలరు? అనుభవించి తీరవలసిందే-మనం చేయుగలిగింది ఏముంది-అన్న ఆధ్యాత్మికతత్త్వం గల మహా వేదాంతి.

ఇన్ని మంచి లక్షణాలతో విరాజిల్లుతున్న ఆ వ్యక్తి కీర్తి దశదిశలా మలయసమీరంలాగా, శరజ్జ్యోత్స్న లాగా వ్యాపించి ఉందని ఆయన స్వజనం సగౌరవంగా చెప్పుకుంటారు. ఈ విషయాన్ని ప్రతిపక్షం వారు కూడా ఈర్ష్యతో, ద్వేషంతో అంగీకరిస్తూ ఉంటారు.

అందరికీ తెలిసిన విషయం, ఎవ్వరూ ఎవ్వరితోనూ పైకి చెప్పని విషయం ఆయన అజాత శత్రువని. అంటే, రాజకీయరంగంలో దాని అర్థం 'బతికి ఉన్న శత్రువులు లేనివా'డని!

ఆ రాష్ట్రంలో నలుగురు వ్యక్తులకు కిందటి రోజు శ్రీముఖం వెళ్లింది-మరునాటి ఉదయం పది గంటలకు తన గదిలో హాజరు కమ్మని.

ఉదయం 9 గం. 55 ని॥లకు ఆ నలుగురూ ఆ గదిలో సమావేశమయ్యారు. యజమాని కోసం ఎదురు చూడటం మొదలుపెట్టారు.


సరిగ్గా పది గంటలకు ఆయన వచ్చాడు. వీరందరి నమస్కారాలూ స్వీకరించాడు. చిరునవ్వు నవ్వాడు. నిలబడినవారిని కూర్చోమని సైగ చేశాడు.

అయ్యవారి కనుసన్నల్లో మెలిగే పరిచారకులు అలవాటుగా సంకేతాన్ని గ్రహించి వెంటనే అందరికీ వేడి వేడి కాఫీ తీసుకువచ్చారు.

అందరి దృష్టీ ముఖ్యమంత్రిగారి ఎదుట ఉన్న ఫైల్ మీద ఉంది. మనస్సుల్లో కుతూహలం ఉంది. పర్సనల్ సెక్రటరీ ఏదో నెమ్మదిగా చెప్పాడు.

అయ్యవారు ఒక్క క్షణం విని ఇంకో క్షణం ఆలోచించి, "సరే, ఒక అరగంటలో బయలుదేరుదాం!" అని చెప్పాడు. సూటు వేసుకున్న వ్యక్తివంక చూశాడు.

"కలెక్టర్ భండారీ! ఒక చాలా చిన్న విషయం గురించి మీరు ఇంత దూరం రావలసి వచ్చింది. మీ రికమండేషన్ గురించి సీరియస్‌గా ఆలోచిస్తాను, చూద్దాం. ఈ విషయం గురించి మీరు ఇహ కాలం వృథా చేయనక్కర్లేదు. ఇంకా ఏవైనా పనులు సెక్రటేరియట్‌లో ఉంటే, అవి చూసుకుని హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లిపోవచ్చును!" అని తన ఎదురుగా కూర్చున్న వ్యక్తితో అంటే, ఆయన లేచి అందరికీ నమస్కారం చేసి, ఏమీ



మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

ముఖ్యమంత్రిగారి దృష్టి ఎదురుగా కంచి పట్టుచీర కట్టుకున్న అభద్రమహిళ మీద నిలచింది.

"మా మునిసిపల్ ఛైర్‌పర్సన్ కృష్ణవేణమ్మగారు ఎలా ఉన్నారు? పర్మిషన్ తీసుకోకుండా అమెరికా వెళ్లిన మీ శ్రీవారు ఇండియా తిరిగి వస్తారా? లేకపోతే మీరు కూడా అక్కడికి వెళ్లి అక్కడి నుంచే మీ నగరం పరిపాలిస్తారా? త్వరగా నిర్ణయించుకోండి!" అంటూ ఆయన నవ్వాడు.


ఆవిడ నవ్వలేదు కానీ, భయపడుతూనే సమాధానం చెప్పింది. "ఇంకా నిర్ణయించుకోలేదు!" కానీ ఆవిడ దృష్టి ఆ ఫైల్ మీదనే ఉంది.

"మన రాష్ట్రంలో మీది మేజర్ మునిసిపాలిటీ. మీకు చాలా సమస్యలుంటాయి. అవి పరిష్కారం చేసుకోండి. స్టేట్‌కు సంబంధించినవీ, ఎండోమెంట్స్‌కు సంబంధించినవీ ఆ డిపార్ట్‌మెంటు వాళ్లకు వదిలిపెట్టండి. ఈ ఫైల్ విషయంలో మీరు చాలా పర్సనల్ ఇంటరెస్ట్ చూపిస్తున్నారని నేను గ్రహించాను. మీరు ఊరి పెద్దలు. మీ అభిప్రాయాలను మేము తప్పక పరిశీలనలోకి తీసుకుంటాము. ఎంతో శ్రమకోర్చి రాత్రి అంతా ప్రయాణం చేసి మీరు రావడం, నా మాట మన్నించడం నాకు చాలా ఆనందంగా ఉంది!" అంటూ ఆవిడకు నమస్కారం పెడుతూ కొసమెరుపుగా ఆయన అన్న మాటలు- "మన తాబేదారులకు సకాలంలో జీతాలివ్వవలసిన బాధ్యత మనకు ఉంది. ఆ బాధ్యతను మీరు ఎందుకో విస్మరిస్తున్నారు. పని సక్రమంగా చేసినప్పుడే పదవులు నిలబడేది. ముందు ఆ పని చూడండి! ఈ పనికి రాని ఫైల్ కంటే అది చాలా ముఖ్యం!"

ఆవిడ ఏమీ మాట్లాడలేదు. చెప్పదలుచుకున్న విషయం మనసులోనే దాచుకుంది. అందరికీ నమస్కారం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

ముఖ్యమంత్రి ముఖంలో చిరునవ్వు మాయమైంది. కళ్లు ఎరుపెక్కాయి. కంఠస్వరంలో కర్కశత్వం వచ్చింది.

ఎదుటి మనిషి గుండెల్లో దడ ప్రారంభమైంది. "ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు చంద్రరావుగారూ! ప్రభుత్వం మీకు ఉద్యోగం ఇచ్చింది బాధ్యతతో మీ పనులు నిర్వహించడానికి. దానికి తగిన జీతభత్యాలిచ్చి పోషిస్తోంది. గవర్నమెంటు ఉద్యోగం అంటే మన పబ్బం గడుపుకోవడానికీ, సొంత వ్యాపారాలు చేసుకోవడానికీ కాదు. గవర్నమెంటు ఉద్యోగం అంటే, మీకు అత్తవారిల్లు. మీరేమో పండుగకు వచ్చిన అల్లుళ్లు కాదు. ఉద్యోగం ఒక చోట, కాపురం ఇంకొక చోట ఉంటూ గవర్నమెంటును మోసం చేసే మీరు కూడా మాకు సలహాలు చెప్పేవారే! ఈ వ్యవహారంలో ఏ మాత్రం ముడుపులు ముట్టాయి?"



ఆ వ్యక్తి ముఖంలో బాధ కనిపించింది. కోపం కనిపించింది. మెల్లగా లేచి నిలబడ్డాడు. "నా డ్యూటీ సక్రమంగా నిర్వహించడానికే ఈ కార్యక్రమం నేను చేపట్టాను. మీరు విషయాన్ని పూర్తిగా తెలుసుకోకుండా అభాండాలు వేస్తున్నారు. అకారణంగా దూషిస్తున్నారు. దైవకార్యంలో అన్యాయం జరగకూడదనీ, అర్హులైన వారికి తగిన గుర్తింపు లభించాలనీ ఈ కార్యక్రమం వుద్దేశం. ప్రజలందరి అభ్యర్థనా మీకు స్వయంగా విన్నవిస్తే, సక్రమంగా జరుగుతుందన్న ఆశతో, నమ్మకంతో మీకు మహజరు పంపించాము. మీ ఆజ్ఞ మేరకు ఇక్కడికి వచ్చాము. సమదృష్టితో చూసినప్పుడు సమస్యలు పరిష్కారమవుతాయి. వ్యక్తిగత దూషణల వల్ల కాదు!"

ఆ గదిలో చీమ చిటుక్కుమన్నంత నిశ్శబ్దం! మరుక్షణం ముఖ్యమంత్రి పెద్దపెట్టున నవ్వాడు.

"పంతులుగారికి కోపం వచ్చినట్టుంది. కూర్చోండి! మీ మాటలు వింటూంటే ప్రతిపక్ష నాయకుడి వాదం విన్నంత ఆనందం కలిగింది. మీలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉంటే ఎంతో రాణిస్తారు. పదిమందికి మేలు చేస్తారు. మీరు పంపిన మహజరు కూలంకషంగా పరిశీలించి ఒక మంచి నిర్ణయం తీసుకుంటాము. క్షేమంగా వెళ్లి రండి!" అని అనగానే ఆ ఎదుటి మనిషి ఆ గదిలో ఉన్న ఇద్దరికీ నమస్కారం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ....

అంత వరకూ బల్ల మీద ఉన్న ఆ ఫైలు ముఖ్యమంత్రి తెరిచి చదవటం మొదలుపెట్టారు. విషయం : "... నగరంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ... స్వామివారి ఆలయ ధర్మకర్తల నిర్ణయం .. అభ్యర్థులు- మహామహోపాధ్యాయ షడ్దర్శన ప్రవీణ, ఉభయ వేదాంతశిరోమణి, వాస్తు సమ్రాట్ ... శైవ, వైష్ణవ, వైఖానస ఆగమ పండిత శ్రీ హయగ్రీవాచారిగారు.

ఆలయస్థాపకుల వంశంలోని వారు స్వామివారి నిత్యధూపదీపనైవేద్యం నిమిత్తం సుక్షేత్రమైన మాగాణి పొలం 365 ఎకరములు ఇచ్చిన జమీందారులు రామేశ్వరంగారు స్వయంగా రామాయలం నిర్మించి, ఎంతో శ్రద్ధగా నిత్య అనుష్ఠాన ఉపాసనలతో దైవకార్యం నిర్వహిస్తున్న ప్రముఖ ఆడిటర్, దాత సుబ్రహ్మణ్యం గారు. స్వధనంతో అనాథ శిశువులకూ, వృద్ధులకూ శరణాలయం నిర్వహిస్తున్న సంఘసేవకురాలు, ప్రముఖవైద్యులు శ్రీ, ఆనందరావుగారి సతీమణి శకుంతలాదేవి గారు...

ఆ ఫైలు మూసేస్తూ ముఖ్యమంత్రి మూడు ప్రశ్నలు వేశాడు-"ఈ వ్యక్తులు మన పార్టీ సభ్యులా? పార్టీ ఫండ్‌కు ఏమైనా విరాళం

ఇచ్చారా? ఎన్నికల్లో మన తరఫున ప్రచారం చేశారా?"

చాలాసేపు తటపటాయించి, రత్తయ్య సమాధానం చెప్పాడు-"లేదు!"

"రత్తయ్యా, నువ్వు చాలా అదృష్టవంతుడివి! చాలా సంతోషకరమైన విషయం ఏమిటంటే నీ నియోజకవర్గంలో చాలా గొప్ప వ్యక్తులు... దేశంలో అందరూ గర్వించదగ్గ వ్యక్తులు ఉన్నారు."

"అవునండీ, చాలా గొప్ప వాళ్లండీ!"

"మన ప్రజాస్వామ్యంలో ఉన్న విశేషం నీకు తెలుసా?" అని ప్రశ్నించారు.

రత్తయ్య అడ్డంగా తల ఊపాడు. "అటువంటి పెద్ద పెద్ద విషయాలు మాకేటి తెలుస్తాయండీ?" అని అన్నాడు.

"నేను చెబుతున్నాను తెలుసుకో, ఒక గొప్ప వ్యక్తి... ఎవరైనా సరే, అతను మన పార్టీ వాడైనా. ప్రతిపక్షం వాడైనా సరే... అతన్ని గౌరవించడం మనకు నేర్పుతుంది. దాని వలన వాళ్లు సంతోషిస్తారు. ఈ నాడు కాకపోయినా ఇంకొక నాడైనా మనకు ఉపయోగపడతారు."

"గొప్ప విషయాలు ఈనాడు తెలుసుకుంటున్నాను. మీరు చెప్పినవన్నీ నిజం! ముమ్మాటికీ నిజం!" అని రత్తయ్య అన్నాడు.

"మనం ఎవరికైనా సహాయం చేయాలంటే మన దగ్గర ఏమి ఉండాలి?"

"డబ్బు! చాలా డబ్బు!"

"అక్కడే పప్పులో కాలు వేశావు! రాజకీయాల్లో ముఖ్యంగా కావలసింది డబ్బు కాదు. అధికారం, పలుకుబడి, బలం! ధనం కూడా ఉండాలనుకో... అది అవసరమే. నేను ముందు చెప్పినవి ఉంటే మిగతావి అవే వస్తాయి."

"చిత్తం! ఈ రహస్యం నాకు ఇంత వరకూ తెలియదండీ!"

"రత్తయ్యా! మనకు అధికారం ఎలా వస్తుంది?"

ఎం.ఎల్.ఏ. చాలా ఆలోచించి "మనం ఎన్నికలలో గెలవడం వలన" అని ధైర్యంగా చెప్పాడు.

"బాగుంది! మనం ఎన్నికలలో గెలవాలి అంటే?"

"మనకు ఎక్కువ ఓట్లు రావాలి?"

"మనకు, ఎక్కువ ఓట్లు ఎలా వస్తాయి?"

"ఓటర్ల వలన..."

పెద్దవారు పెద్ద పెట్టున నవ్వి, "రాజకీయాల్లో ఇంకా పసివాడివి. ఓటర్ల వలన కాదు, కార్యకర్తల వలన. ఎందుకంటే ఎన్నికల్లో గెలవాలంటే రెండు పనులు చేయాలి. మనకు రావలసిన ఓట్లు అన్నీ పోలింగ్ జరిగేలా చూసుకోవాలి. ప్రత్యర్థులకు ఓట్లు పడకుండా చూసుకోవాలి. ఈ పని సామాన్య ఓటరుకు సాధ్యం కాదు. కార్యకర్తలే చేయగలరు. వారిని ఎప్పుడూ సంతోషంగా ఉండేలా చేస్తేనే మన నాయకత్వం నిలబడేది."

ఎం.ఎల్.ఏ. "మరి ..." అంటూ ఏదో చెప్ప బోయాడు.

నాయకుడు మధ్యలో అందుకుని, తన ముందున్న ఫైలు తెరిచి దాంట్లో రాసిన పేర్లు మళ్లీ ఇంకొక్కసారి చదివాడు.

"వీళ్లను గురించి పదిమందికీ చెప్పావా? వాగ్దానాలు ఏమైనా చేశావా? అని అడిగారు.

"లేదు. ప్రజలు మెమోరాండం తీసుకువచ్చినప్పుడు చూద్దాం!" అని అన్నాడు.

"చేస్తాను అని అనలేదుగా! సంతోషం. రత్తయ్యా, ఒక్క విషయం బాగా గుర్తుపెట్టుకో, కొందరు గొప్ప వ్యక్తులుంటారు. వారికి పదవులు అక్కర్లేదు. వారి వల్ల పదవులకు గౌరవం వస్తుంది. కొందరికి పదవుల వల్లనే గౌరవం వస్తుంది. గుర్తింపు వస్తుంది. హంగూ, బలం పెరుగుతాయి. మనకు కావలసిన వాళ్లు రెండవ రకం వాళ్లు. మన కంటే గొప్పవారికి దూరంగా ఉండాలి. దూరంగా ఉంచాలి..." అంటూ నాయకుడు ఏదో చెప్పుకుపోతున్నాడు.

"మరి నియోజకవర్గం... ప్రజలూ..." అంటూ ఎం.ఎల్.ఏ. ఏదో మనవి చేయబోయాడు.

"నేను చెప్పినది చెయ్యి! అన్నీ సర్దుకుంటాయి. స్వామికార్యం, స్వకార్యం రెండూ నెరవేరుతాయి. వెళ్లి రా!" అని పెద్దాయన సెలవిచ్చాడు.

మండలం తిరగకుండా ఆ నియోజకవర్గంలో నభూతో న భవిష్యతి అన్న తీరులో ఆ సన్మాన కార్యక్రమం జరిగింది.

గంగాధర సోమయాజి గారికి శ్రీ హయగ్రీవాచారికి కనకాభిషేకం.

రామేశ్వరం గారికి గజారోహణం.

శ్రీ సుబ్రహ్మణ్యం గారికి వెండి కిరీటం, పండిత శాలువ. శకుంతలమ్మ గారికి ఘనసన్మానం. కంచిపట్టు చీరతోపాటు పసుపు-కుంకుం, 'సంఘరత్న' అన్న బిరుదు ఇచ్చారు.

అయిదు రోజుల పెళ్లి అంత హడావుడిగా, వైభవంగా చేశారు.

ఎం.ఎల్.ఏ. గారి విచక్షణ, వివేకం, వితరణ గురించి పత్రికలు, ప్రజలు వెయ్యినోళ్ల పొగిడారు.

హడావుడి తగ్గి ఊరు మాటు మణిగింది.

చాప కిందికి నీరు వచ్చింది. కథ కంచికి వెడుతూ కొసమెరుపుగా పబ్లిసిటీ లేకుండా కొన్ని పనులు జరిగాయి.

కలెక్టరు గిరిజన్ కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా వెళ్లాడు.

అకస్మాత్తుగా వచ్చిన అవిశ్వాసతీర్మానానికి అసహ్యం పుట్టి పదవికి రాజీనామా చేసి, మునిసిపల్ ఛైర్ పర్సన్ అమెరికా వెళ్లిపోయింది.

ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు మీద డిపార్ట్‌మెంట్ విచారణ చేసి శంకరగిరి మాన్యానికి బదిలీ చేసింది.

పక్షం గడిచింది. నిరాడంబరంగా నిశ్శబ్దంగా ఆలయ ధర్మకర్తల పదవీస్వీకారమహోత్సవం జరిగింది. ధర్మకర్తలు హోటలు యజమాని, సివిల్ కాంట్రాక్టరు, బట్టలు కుట్టే టైలర్, చిట్‌ఫండ్ కంపెనీ డైరెక్టర్ నాలుగో క్లాసుతో చదువు మానేసిన ఒక రాజకీయనాయకురాలు.

గొర్రెల మందకు ఈ విషయాలు ఏమీ పట్టలేదు. నాయకుడి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారు.

ఎప్పటి లాగానే గాంధీ పుట్టిన దేశం... నిశ్శబ్దంగా, నిర్లిప్తంగా, మూగసాక్షిగా మిగిలిపోయింది. ■

